నమస్తే తెలంగాణ



లక్షెట్టిపేట రూరల్ : తిమ్మాపూర్ ప్రచారంలో ఓటర్లతో మాట్లాడుతున్న మంచిర్యాల అభ్యర్థి దివాకర్‌రావు

# అభివృద్ధిని చూసి ఆదరించండి

- సంక్షేమ పథకాలను గమనించండి
- మంచిర్యాల బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్‌రావు
- లక్షెట్టిపేట మండలంలో ప్రచారం

లక్షెట్టిపేట రూరల్, అక్టోబర్ 27 : పదేళ్లుగా సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి బీఆర్‌ఎస్ పార్టీని ఆదరించాలని మంచిర్యాల బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే నడిపల్లి దివాకర్ రావు ప్రజలను కోరారు. లక్షెట్టిపేట మండలం బలరావుపేట, జెండా వెంకటాపూర్, తిమ్మాపూర్ గ్రామాల్లో శుక్రవారం నాయకులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాల పాలనలో తెలంగాణ ప్రజలు, రైతులు పడ్డ కష్టాలను ఒక్కసారి గుర్తు చేసుకోవాలన్నారు. స్వరాష్ట్రం సాధించుకున్నాక ఎల్లంపల్లి ప్రాజెక్టుతో పాటు గూడెం ఎత్తిపోతల పథకంతో రైతాంగానికి సరిపడా నీటిని అందించిన ఘనుడు మన సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. రైతులకు 24గంటల కరెంటుతో పాటు రైతు బంధు పథకం పెట్టి వ్యవసాయానికి పెట్టుబడి అందజేశాడని తెలిపారు. ప్రతి ఒక్కరూ బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటేసి, భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ తిప్పని లింగన్న, జడ్పీటీసీ ముత్తె సత్తయ్య, సర్పంచులు చుంచు రవి, వెల్తపు సునీత, ఎంపీటీసీ గడుసు స్వప్న, కోన సరిత, పార్టీ మండలాధ్యక్షుడు చుంచు చిన్నయ్య, డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పార్టీ ఉపాధ్యక్షుడు అంకతి రమేశ్, ప్రధానకార్యదర్శి అనీల్ రెడ్డి, నాయకులు గడుసు రమేశ్, వెల్తపు సుధాకర్, కోన తిరుపతి, వెంకట్రావు, అంకతి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

### కొలాంగూడలో..

హాజీపూర్, అక్టోబర్ 27 : హాజీపూర్ మండలం కొలాంగూడలో ఎమ్మెల్యే దివాకర్ రావు ప్రచారం నిర్వహించారు. గిరిజనులతో మాట్లాడుతూ. గ్రామ అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమైందన్నారు. ఆయన వెంట బుద్ధిపెల్లి సర్పంచ్ అన్నం మధుసూదన్ రెడ్డి, ఎంపీటీసీ జాడి వెంకటేశ్, నాయకులు బేతు రవి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆశీర్వదించండి.. అభివృద్ధిని కొనసాగిస్తా

- విపక్షాల ఎత్తుగడలను తిప్పి కొట్టాలి
- చెన్నూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్
- మందమర్రి మున్సిపాలిటీలో ఎన్నికల ప్రచారం



మందమర్రిలో సీఎం సభపై నాయకులకు సూచనలు చేస్తున్న చెన్నూర్ అభ్యర్థి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్

మందమర్రి, అక్టోబర్ 27 : ప్రజలు ఆశీర్వదించి కారు గుర్తుకు ఓటువేసి చెన్నూర్ ఎమ్మెల్యేగా గెలిపించాలని, అభివృద్ధిని కొనసాగిస్తానని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ కోరారు. మందమర్రి పట్టణంలోని పాలచెట్టు ఏరియాలో గల శ్రీ పంచముఖి ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేసి, ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఏడో వార్డులో గల పాలచెట్టు ఏరియా, మూడో జోన్ కార్మిక కాలనీలు, ఎమ్మెల్యే కాలనీలో నాయకులు, కార్యకర్తలతో కలసి విస్తృత ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి నియోజకవర్గ ఎమ్మెల్యేగా తనను, సీఎంగా కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎన్నికల మ్యానిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. కాలనీల్లో మహిళలు మంగళహారతులతో బొట్టు పెట్టి, ఆయనను ఆహ్వానించారు. పాలచెట్టు ప్రాంతంలో వ్యాపారులను కలసి, బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇవావలని కోరారు. ఆర్‌ఎంపీ వైద్యుడు పోచన్న సుమన్‌ను శాలువాతో సత్కరించి, మద్దతు తెలిపారు. మూడో జోన్ ఏరియాలో విప్ సుమన్ మటన్ షాపులో మటన్ కొట్టడంతో పాటు ఆటో నడిపి, లాండ్రిషాపులో బట్టలను ఇస్త్రీ చేసి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్, టీబీజీకేఎస్, మహిళా విభాగం, యూత్ నాయకులు, సోషల్ మీడియా వారియర్స్ పాల్గొన్నారు.

## బ్యాట్ పట్టి.. బౌలింగ్ చేసి..

మంచిర్యాల స్టాఫ్ ఫొటోగ్రాఫర్, అక్టోబర్ 27 : మందమర్రి పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానంలో వచ్చే నెల 7న సీఎం కేసీఆర్ బహిరంగ సభ ఉండగా, శుక్రవారం ఏర్పాట్ల పరిశీలనకు వచ్చిన చెన్నూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, విప్ సుమన్ మైదానంలో క్రికెట్ ఆడారు. పరిశీలనకు వచ్చిన సమయంలో క్రికెట్ ఆడుతున్న యువతను చూసి, తానూ ఆడుతానని చెప్పి, సుమారు అరగంటపాటు బ్యాటింగ్, బౌలింగ్ చేశారు. భారీ షాట్లు కొట్టి, యువతను, తన వెంట వచ్చిన నాయకులను ఉత్సాహపరిచారు.





క్రికెట్ ఆడుతున్న చెన్నూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్

# రైతు ద్రోహి కాంగ్రెస్ పార్టీ

- రైతు బంధు నిలిపివేయాలని ఈసీకి ఫిర్యాదు
- ఓడిపోతామనే భయంతోనే రాజకీయాలు
- బెల్లంపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య
- బీఆర్‌ఎస్‌లో చేరికలు



బెల్లంపల్లి : మాట్లాడుతున్న బెల్లంపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి దుర్గం చిన్నయ్య, చిత్రంలో ఎంపీ వెంకటేశ్ నేతకాని

బెల్లంపల్లి, అక్టోబర్ 27 : రైతు బంధు పథకాన్ని నిలిపివేయాలని కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడంతో కాంగ్రెస్ మరోసారి రైతు ద్రోహి పార్టీ అని తేటతెల్లమైందని బెల్లంపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆరోపించారు. తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దపల్లి ఎంపీ, ఎన్నికల ఇన్‌చార్జి వెంకటేశ్ నేతకాని, రాష్ట్ర ఫిల్మ్ డెవలప్‌మెంట్ మాజీ చైర్మన్ పూస్కూరి రాంమోహన్‌రావుతో కలిసి మాట్లాడారు. రైతులకు మూడు గంటల కరెంట్ చాలు అని ప్రకటించిన కాంగ్రెస్‌కు రైతుల మీద ఎంత ప్రేమ ఉన్నదో అర్థం చేసుకోవచ్చని విమర్శించారు. సీఎం కేసీఆర్ దేశంలో ఎక్కడా లేని విధంగా రైతు సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కాంగ్రెస్ నాయకులు నీచ రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. ఎన్ని కుటిల రాజకీయాలు చేసినా సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీ వెంకటేశ్ నేతకాని మాట్లాడారు. సౌమ్యుడు, కింది స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదిగి, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటున్న దుర్గం చిన్నయ్యను నియోజకవర్గ ప్రజలు ఆదరించాలని కోరారు. ఎన్నికల సమయంలోనే నోట్ల కట్టలతో వచ్చే స్థానికేతరులను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ కనుమరుగయ్యే పార్టీ అని, నాయకులు సీఎం కుర్చీ కోసం కొట్లాడుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పాలిత ప్రాంతాల్లో ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో చేతులెత్తేసిందని విమర్శించారు. కర్ణాటకలో ఇచ్చిన హామీలను అమలు చేయలేమని అక్కడి ఎమ్మెల్యే పండక్షరీయే పేర్కొన్నారని గుర్తు చేశారు. తొమ్మిదిన్నరేళ్లలోనే 60 ఏండ్లుగా జరగని అభివృద్ధిని, సీఎం కేసీఆర్ చేసి చూపించారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బత్తుల సుదర్శన్, కౌన్సిలర్ గెల్లి రాజలింగు, నాయకులు రేవెల్లి విజయ్‌కుమార్, సత్యనారాయణ, నెలకంటి శ్రీనాథ్ బాబు, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం వేమనపల్లి మండలానికి చెందిన పలువురు నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కాగా, వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీఎం కేసీఆర్ అవలంబిస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలను చూసే బీఆర్‌ఎస్ పార్టీలో ఇతర పార్టీలకు చెందిన నాయకులు చేరుతున్నారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కోలి వేణుమాధవ్‌రావు, ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

### బీఆర్‌ఎస్‌లో చేరికలు..

తాండూర్, అక్టోబర్ 27 : మండలంలోని బోయపల్లిలో సీపీఐ, ఇతర పార్టీలకు చెందిన నాయకులు, మహిళలతో పాటు యువకులు సుమారు వంద మంది బోయపల్లి ఎంపీటీసీ, బుగ్గ దేవస్థానం చైర్ పర్సన్ మాసాడి శ్రీదేవి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ మంగపతి సురేశ్ బాబు, సర్పంచ్ భీమ సునీత, రైతు బంధు సమితి జిల్లా సభ్యుడు మాసాడి తిరుపతి, ఉప సర్పంచ్ రౌతు వెంకటేశం, నాయకులు భీమ రాజ్‌కుమార్, మిట్ట నారాయణ, రుకుం తిరుపతి, సోషల్ మీడియా వారియర్స్ గుగ్గిల్ల రాజాబాబు గౌడ్, రుకుం ప్రసాద్, దాడి బాలాజీ, మాసాడి శశివర్ధన్, ముదాం రఘు పాల్గొన్నారు.

## బీఆర్‌ఎస్‌తోనే మైనార్టీలకు గుర్తింపు

ఆసిఫాబాద్, అక్టోబర్ 27 : బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే మైనార్టీలకు గుర్తింపు లభించిందని క్రిస్టియన్ ఫైనాన్షియల్ చైర్మన్ డాక్టర్ రాజేశ్వర్‌రావు అన్నారు. ఆసిఫాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి నివాసం వద్ద శుక్రవారం ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలసి నియోజవర్గ ఫాస్టర్స్, క్రైస్తవ సంఘాల మత గురువులతో సమావేశం నిర్వహించారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి గెలుపు కోసం ప్రార్థనలు చేశారు. జిల్లా ఫాస్టర్ల సంఘం అధ్యక్షుడు గోగు రాజారత్నం, సెక్రటరీ పొన్నాల నారాయణ, జయరాజు, తియోతి, ఇర్మియ, జాషువా, ప్రమోద్, ఉప్పరి నగేశ్, మంచిర్యాల క్రిష్టియన్ జిల్లా అధ్యక్షులు సామ్యేల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేశ్వర్‌రావు, చిత్రంలో ఆసిఫాబాద్ అభ్యర్థి కోవ లక్ష్మి, ఎమ్మెల్యే సక్కు



మాట్లాడుతున్న సిర్పూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, హాజరైన నాయకులు, ప్రజలు

# అభివృద్ధిని అడ్డుకునే కుట్ర

- సిర్పూర్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

చింతలమానేపల్లి, అక్టోబర్ 27 : నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని ఆపేందుకే సిర్పూర్‌లో ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ పోటీ చేస్తున్నాడని, బీజేపీ, కాంగ్రెస్‌కు కోవర్టుగాపని చేస్తున్నాడని బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఆరోపించారు. అభివృద్ధిని చూసి ఆశీర్వదించాలని, ప్రగతిని కొనసాగిస్తానని ప్రజలను కోరారు. చింతలమానేపల్లి, గూడెం గ్రామాల్లో శుక్రవారం కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేక బీజేపీ, కాంగ్రెస్, బీఎస్పీలు అడ్డుపడుతున్నాయని ఆరోపించారు. చింతలమానేపల్లిని నూతన మండలంగా ఏర్పాటు చేసుకొని అభివృద్ధిలో ముందుకుసాగుతున్నట్లు చెప్పారు. ఎంపీపీ డుబ్బుల నానయ్య, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు డుబ్బుల వెంకయ్య, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తులు పాల్గొన్నారు.